**కథ**

**ఉండుండి పిల్లగాలులు మోసుకొస్తున్న మల్లెల వాసనలకి మనసు స్పందిస్తోందివాళ వింతగా. ఎక్కడో కోస్తా ప్రాంతాల్లో వర్షాలు పడ్తున్నట్లున్నాయి. అందుకే మార్చి నెల చివరైనా వాతావరణం ఆహ్లాదంగా వుంది రెండురోజుల నుండి. ఆనందం, విషాదం కలగాపులగమై తమాషా ఫీలింగ్. నేనింతకు ముందెప్పుడూ అనుభవించని గమ్మత్తైన భావన.**

# స్వర్ణోత్సవం

అవును నేను సామాన్యుడిగా బ్రతికినన్నాళ్ళూ జీవిత పోరాటానికే అయిపోయింది టైమంతా. ఇంకిప్పుడు హై ఫ్లైయింగ్ లైఫ్‌లో అస్సలు ఇరవై నాలుగుగంటలు కాదు రోజులూ, నెలలూ ఎలా దొర్లిపోతున్నాయో తెలీడం లేదు. అప్పుడూ ఇప్పుడూ చుట్టూ వున్న అందాల్ని, ఆనందాల్ని ఆస్వాదించడానికి వీలులేకుండా నా మనసుకి తెరవేసి పరిగెత్తించిందీ కాలమనే ఫాస్ట్ రన్నర్. మరెందుకివాళ అయిదుపదులు దగ్గరపడే వయసులో ఈ చల్లని సాయంసంధ్య నా హృదయాన్ని గంతులు వేయిస్తోంది. అందుకు వింధ్య రాసిన వుత్తరం కారణమా? తను రాసిన లేఖ నా మనసునంతా తడిమితడిమి మరుగుపడిపోయిన సున్నితతత్వాన్ని తట్టిలేపినట్టైంది. ఓ పక్క అపరాధన భావం, ఓ పక్క నాకే తెలియని ఆనందం.

'ఎందుకిలా అయ్యింది?' ఇలా అనుకోవడం మధ్యాహ్నం నుండీ ఎన్నోసారో! ఎంత పొరపాటు జరిగిపోయింది! అయినా జారిపోయిన పాతిక సంవత్సరాలని పట్టి వెనక్కి తీసుకురాగలనా? ఎంతో తెలివిగలవాడినని, మనుషుల మనసుల్ని తాకగలననే గర్వం అప్పుడప్పుడూ నా అంతరాంతరాల్లో తలెత్తుతుంది. మరింత పెద్ద పొరపాటు కాదు, క్షమించరాని తప్పు (నా మటుకు నాకు) ఎలా చేశాను. చాలా చాలా బాధగా వుంది. బహుశా వింధ్య ఆ వుత్తరం గనక రాసి వుండకపోతే, నేనింకా నా ధోరణిలోనే జీవితం లాగించేసే వాడినేమో! వింధ్య యిలా తన మనసు నాకు కనీసం ఇరవై సంవత్సరాల ముందైనా నా ముందు విప్పగల్గితే ఎంత బాగుండేది. పిచ్చిది. ఒకటా, రెండా పాతికేళ్ళు అపర ధరిత్రిలా నా నిర్లక్ష్యాన్ని భరించింది. అలా అనుకోగానే నా కళ్ళు చమరించాయి. మళ్ళీ ఇంకోసారి తన వుత్తరం చదవాలనిపించి లోనికి వెళ్ళి ఉత్తరం, కళ్ళజోడు తెచ్చుకొని తోట మధ్య ఉయ్యాలలో చిన్నగా వూగుతూ ఉత్తరం మడతలు విప్పాను.

"ప్రియమైన మీకు!

వారం వారం మాట్లాడుకుంటూనే వున్నాం కదా మళ్ళీ ఈ లెటరేమిటని విసుగ్గా వుందా? చదివితే తెలుస్తుంది లెండి. నాకిప్పుడు అందలమెక్కినంత సంతోషంగా వుంది. నాకు తెలుసు నేను అమెరికా వచ్చినందుకనుకుంటున్నారు కదూ? మీ అంచనా తప్పు. నాకెందుకింత సంబరంగా వుందో చెప్పనా? ఇలా ఏడు సముద్రాలవతల ఒంటరిగా కూర్చుని మీకు ప్రేమలేఖ రాయడం. అవును, దీన్ని నేను ప్రేమలేఖనే అంటాను. ఇన్నాళ్ళకి మీకు నేనొక వుత్తరం రాసే భాగ్యమూ, అవకాశమూ దక్కింది. అవునండీ నాకు చిన్నప్పటినుండీ భావుకత ఎక్కువ పాళ్ళలో వుండేది. ఇప్పుడు కూడా అలానే వుందింకా. పెళ్ళంటే అదొక సుందర నందనవనమనీ, ప్రేమానురాగాలూ, మల్లెలూ, మలయమారుతాల కలబోత అనుకుంటూ కలలుకనే దాన్ని. ప్రపంచంలోని ఆనందాన్నంతా నా భర్తతో కలిసి పంచుకుంటూ ప్రేమసాగరంలో నా సంసారనౌక తీయగా సాగిపోతుందని ఏవో లోకాల్లో విహరిస్తూ పిచ్చికలలు కనేదాన్ని. నా కలలూ, కోర్కెలతో పనిలేకుండా నా పెళ్ళి మీతో జరిగిపోయింది. రావడం రావడం అత్తమామలూ, ఆడపడుచులూ, మరుదులతో కోలాహలంగా వున్న పెద్ద సంసారంలో పడ్డాను. అదిగో అప్పుడు పడిన పడడం, మళ్ళీ యిప్పుడిలా కాలిఫోర్నియాలో లేవడమయ్యింది. నా ముచ్చట్లేమీ తీరకుండానే ఇద్దరాడ పిల్లలకి తల్లినయ్యాను. ఆడపడుచుల పెళ్ళిళ్ళు, మరుదుల పెళ్ళిళ్ళూ, చివరికి మనమ్మాయిల పెళ్ళిళ్ళూ కూడా కళ్ళు మూసి తెరిచేటంతలో జరిగిపోయినట్లయింది. ఈమధ్యకాలంలో మల్లెల సెలయేర్లు, మలయమారుతాలు, నీలిమేఘాల ఆలోచనలు మాత్రం నాలో సాగుతూనే ఉన్నాయి. మీతో కలిసి వాటి అందాల్ని పంచుకోవాలనే కోరిక మాత్రం సాగలేదు. నా భావుకత ఈ పాతికేళ్ళలో ఈషణ్మాత్రంగా కూడా తరగలేదు. తొలకరి జల్లులో, కోయిలమ్మ తొలిగీతంలో తొలి మల్లె విరిసినప్పుడు మీరు పక్కనుంటే ఎంత బాగుండునని పదే పదే అనుకునేదాన్ని. (ఇప్పటికీ అనుకుంటూనే వున్నాను) మీరు కావాల్సినంత డబ్బైతే దండిగా సంపాదించారుగానీ మీలో రవ్వంతైనా రసికత లేదు సార్! అయినా మీరంటే నాకు పిచ్చిప్రేమ. మీతో ఒంటరిగా గడపాలని పెళ్ళైన కొత్తలో ఎంత తపించిపోయేదాన్నో. సాగితేనా! అప్పటినుండి ఇప్పటివరకూ ఆడపడుచులు, మరుదులు, అత్తమామలు, చివరికి నా కూతుళ్ళు కూడా నాకా సంతోషాన్ని దక్కనివ్వలేదు. మీరు కొత్తగా కారు కొన్న రోజున మీతో నేను మాత్రమే అలా అలా కారులో తిరిగి వస్తే బాగుండునని ఎంతో అనిపించింది. మీరు పిలుస్తారని ఎదురుచూశాను. అబ్బే, మన పటాలం వదులుతారా. అసలు మనం మాత్రమే ఎక్కడికైనా వెళ్ళిన సంఘటనలున్నాయా? సోషల్ గెట్టుగెదర్స్‌కి వెళ్ళేవాళ్ళం. కానీ ఎలా? డ్రైవర్ కారు నడుపుతుంటే మీరు మీ బిజినెస్ గురించి ఆలోచిస్తూ, నేను రోడ్ల వైపు చూస్తూ అంతేగా.

మీ పక్కన కూర్చుని సాగరంలోంచి దొంగలా మెల్ల మెల్లగా పైకి తేలుతున్న చందమామని చూస్తూ ఆ వెన్నెల్లో తడిసిపోవాలనిపించింది. నాకు హిల్ స్టేషన్స్ అన్నా ముఖ్యంగా హిమాలయాల్ని దగ్గరగా చూడాలన్నా (మీతో మాత్రమే సుమా!) చాలా యిష్టం. అప్పుడప్పుడూ అలా మనిద్దరం హిమాలయాల వైపు చూస్తూ కూర్చున్నట్టు వూహించుకొని మురిసిపోతుంటాను. ఇలా ఏవేవో కోరికలు, ఆశలు, ఎన్నెన్నో సరదాలు. ఒక్కటి తీరితే ఒట్టు.

అసలు విషయం మరిచానండోయ్! మీకో ప్రేమలేఖ రాయాలనే కోరిక కూడా అమితంగా వుండేది. అదీ వుత్తరం రూపంలో యిలా తీర్చుకుంటున్నాను. మరి దీనిని మీరు ప్రేమలేఖే అంటారో లేక ఫిర్యాదులేఖ అంటారో మీ యిష్టం. నా మట్టుకు నేను ప్రేమలేఖనే తృప్తిపడతాను. నా మనసులోని భావాల్ని మీకు చెప్పేశాక నాకు చాలా తేలికగా బలే ఆనందంగా తృప్తిగా వుంది. ఓ పక్క ఆశగా కూడా వుంది. సన్నుత డెలివరీ అయ్యాక మనవడినో మనవరాలినో చూసుకోవడానికి మీరు తప్పకుండా వస్తారు కదా! కనీసం అప్పుడైనా నా కోరిక తీరడానికి ఎవరూ అడ్డుపడరని ఆశపడ్తున్నాను. మనం అలా నవప్రేమికుల్లా తిరుగుతుంటే ఎలా వుంటుందాని వూహించుకొంటే ఉబికి ఉబికి నవ్వొస్తోంది.

కానీ ఒక విషయం స్పష్టంగా చెప్పాలనుంది. నాకు చక్కని అత్తమామల్ని, ఆడపడుచుల్ని, మరుదుల్ని దేవుడిచ్చాడు. కాకపోతే మిమ్మల్ని వాళ్ళతో పంచుకోవల్సి రావడం వల్ల చిన్న చిన్న డిసప్పాయింట్స్ తప్ప, వేరే చికాకులేమీ లేవు నాకు. భార్యగా, కోడలిగా, వదినగా, తల్లిగా నేను నా పాత్రని సంతృప్తిగానే పోషించాను. నా కుటుంబం కోసం నేను చేయడం నా బాధ్యత. ఆ బాధ్యత సవ్యంగా నిర్వర్తించిన తృప్తి నాకు చాలానే వుంది. ఆ విధంగా నేను అదృష్టవంతురాల్నే!

అన్నట్టు మర్చిపోయాను. మన సిల్వర్ వెడ్డింగ్ యానివర్సిరీని మనమ్మాయిలు సన్నుత, వినత ఇద్దరూ అల్లుళ్ళతోసహా గ్రాండ్‌గా ప్లాన్ చేస్తున్నారు. ఆ టైమ్‌కి మీరిక్క

డుండేటట్లుగా మీ ట్రావెల్ షెడ్యూల్ని మార్చుకోమని చెబుతామంటున్నారు. మరి డెసిషన్ మీదే కదా!

చాలా రాసి మిమ్మల్ని విసిగించానేమో కదూ! మీరు మీ పిల్లల మాట కాదనరు. అది నాకు బాగా తెలుసు. మీరు తప్పకుండా వస్తారిక్కడికి. మన పెళ్ళి రజతోత్సవం రోజునైనా కాసేపు మీ బుర్రలోనుంచి వ్యాపారాన్ని తీసిపెట్టి అందులో కాస్త భావుకతని చిలకరించండి. ఇన్ని వసంతాల తర్వాత నిజమైన వసంతం వస్తుందా నాకు? ఏమో! అలా అనుకుంటుంటేనే చాలా గమ్మత్తుగా వుంది. నవ్వుకోరు కదూ!

ప్రేమతో
మీ వింధ్య.



ఉత్తరం పూర్తయ్యేసరికి నిజంగానే నా పెదవులమీద చిరునవ్వు! వింధ్యలో భావుకత ఎక్కువేం ఖర్మ, మితిమీరే వుంది. తన భావాల్ని చాలా అలవోకగా, నాజూకుగా నొప్పించకుండా, చిరుగాలి వీచినట్టుగా తెలిపింది. తన మనసుకి వయసుజాడ తెలియనివ్వలేదు. వింధ్యని పట్టించుకోకుండా తన జీవితాన్ని కూడా లాగేసుకొని, కేవలం నా కోసం, నా కుటుంబం కోసం ఖర్చుపెట్టేశానన్న కోపం ఎక్కడా కనపడలేదా లెటర్లో. తన ముందు నేను మరుగుజ్జునైపోయిన భావన నాలో!

అవును. నేనేం చేశాను తనకోసమంటూ. వింధ్య ఎక్కవుంటంతా క్రెడిట్లే! నా జాబ్‌లో ప్రాబ్లెమ్స్ వస్తే "ఎన్నాళ్ళని పడ్తారీ తిప్పలు. చిన్నదో చితకదో మీకంటూ స్వంతంగా బిజినెస్ పెట్టుకోవా"లని సలహాతోపాటు ధైర్యం కూడా నూరిపోసింది. కాపిటల్ కోసం తిప్పలు పడుతుంటే తనకి పుట్టింటి వాళ్ళిచ్చిన మూడెకరాల పొలం, నగలూ అమ్మేసి సమకూర్చింది. పసుపు కుంకుమల క్రింద మీ వాళ్ళిచ్చినవి కదపొద్దని ఎంత చెప్పినా వినలేదు. నా వాళ్ళిచ్చింది నా భర్తకోసం, నా సంసార సంక్షేమం కోసం అక్కరకు రాకపోతే అర్థమే లేదంది. ఆ చల్లని మనసు సంకల్పమే నేనీ రోజింత ఎదగడానికి కారణం. వింధ్య తెచ్చిన అదృష్టమే యిదంతా.

నేను తనకంటూ ఏమీ చేయలేదు. డబ్బైతే చాలా సంపాదించాను. బంగళాలు, కార్లు, ఫ్యాక్టరీలు, పొలాలు, సైట్లు, బ్యాంక్ బాలెన్సులూ అన్నీ ఎక్కువగానే సమకూరాయి. నా గ్రూప్ కంపెనీల ఛైర్మన్‌గా నాకీ వూళ్ళో చాలా పేరు ప్రతిష్టలున్నాయి. ఏ రోజే కంట్రీలో వుంటానో నాకంటే నా సెక్రటరీకే బాగా తెలుసు. డబ్బైతే దండిగా సమకూర్చినా వింధ్య మనసునేనాడూ అర్థం చేసుకోలేదు నేను. తన హృదయాన్ని తాకేలా నేనే పనీ చేయలేదంత వరకూ. తల్చుకుంటేనే చాలా చిన్నతనంగా వుంది. ఈ ఇల్లు కట్టించినప్పుడు కూడా అన్నీ తనే దగ్గరుండి చూసుకుంది. ఆహ్లాదపరిచే ఈ అందమైన తోట తన స్వహస్తాలతో రూపుదిద్దుకుంది. ఏ ప్రొఫెషనల్ ఇంటీరియర్ డెకరేటర్నీ పెట్టకుండా తనే డ్రైవర్నేసుకొని మూల మూలలన్నీ వెదికి, అరుదైన అపురూపమైన వస్తువులతో, పెయింటింగులతో, ఈ ఇంటినొక అద్భుత కళాఖండంగా తీర్చిదిద్దింది.

అంతస్తు పెరిగిందని తనేనాడూ విరగపడలేదు. కానీ రోజు ఈ వుత్తరం చూస్తుంటే జీవితంలో చిన్న అసంతృప్తిని మిగిల్చిన దోషిగా ఫీల్ అయ్యాను. తన పేరున ఆస్తులు చాలా కొన్నాను. కాని నేనాడూ 'వింధ్యా యిది నీ కోసం' అని చెప్పి సంతోషపెట్టలేదు. తనకీరోజు చాలా నగలున్నాయి. అవి నేను యిష్టంగా కొనిచ్చినవి కావు. మా అంతస్తుకి తగ్గట్టుగా సొసైటీలో కనిపించడానికి నేను డబ్బిచ్చి కొనుక్కోమన్నవి. నేను చేసిన ఏ పనిలోనూ పర్సనల్ టచ్ అసలు లేదు. అంతా యాంత్రికంగా జరిగిపోయిందంతే! అలా అని 'తనంటే నాకు ప్రేమలేదా' అని క్రొత్తగా నన్ను నేనే ప్రశ్నించుకుంటే జవాబు ఖచ్చితంగా 'ఉంది, చాలా వుంద'నే వస్తుంది. బహుశా తను నా జీవితంలో మమేకం అయిపోవడం వల్ల విడిగా తెలియలేదా? లేక తనని నేను 'టేకెన్ ఫర్ గ్రాంటెడ్' అని అంటారే అలా అనుకున్నానా? బిజినెస్ వ్యవహారాల్లో తలమునకలై కూరుకుపోయినందువల్ల తనని పట్టించుకోలేదా? నన్ను నేను సమర్థించుకోవడానికి సరైన కారణాలు దొరకడం లేదు. మొత్తం మీద తన మనసెరిగి

యస్.సుభాషిణి నాయుడు

ప్రవర్తించలేదు. అవును! నిర్లక్ష్యమే చేశాను మరి.

నా గ్రూప్ కంపెనీలలో ఏ హెచార్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ కండక్ట్ చేసినా ముందుగా నా ఎంప్లాయీస్‌ని మోటివేట్ చేయడం కోసం నాలుగు ముక్కలు తప్పకుండా మాట్లాడతాను. నేను మాట్లాడిన మాటల్లో హ్యూమన్ రిలేషన్స్‌కే ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ మాట్లాడతాను. అది నా అలవాటు. వ్యక్తుల మధ్య సంబంధ బాంధవ్యాలు మెరుగైన చోట ప్రొడక్టివిటీ తప్పకుండా మెరుగ్గా వుంటుందని నా నమ్మకం. అయితే నా ఆలోచనలన్నీ నా వ్యాపారం చుట్టూ మాత్రమే తిరిగాయనిపిస్తుందిప్పుడు. నేనో మంచి తండ్రిని, మంచి యజమానిని, మంచి కొడుకుని, మంచి స్నేహితుడిని, మంచి పౌరుడిని అయ్యానుకాని మంచి భర్తని మాత్రం ఖచ్చితంగా కాలేకపోయానని తెలిసిపోయిందివ్వాళ.

నన్నని చిరుజల్లు మొదలై మట్టివాసనా, మల్లెపూల వాసనా కలగలిపి అలజడిగా వున్న నా మనసుని ఆప్యాయంగా నిమిరాయి. ఏమిటో! వింధ్య వుత్తరం మహిమేమో నేనూ సున్నితంగా, భావకవిలా ఆలోచించడం మొదలుపెట్టానా? అలా అనుకుంటే నాకే నవ్వొచ్చింది. దానితో కాస్త హుషారు వచ్చినట్లైంది.

ఏదో ఒకటి చెయ్యాలి. చేసేంతవరకూ మనశ్శాంతుండదు. వానజోరు పెరిగింది. అయినా యింట్లోకి వెళ్ళాలనిపించలేదు. నిజంగానే వింధ్య లేని యిల్లు అమ్మవారు లేని ఆలయంలా వెలితిగా వుంది. ఇంటికి యిల్లాలెంత అందమో, ఎంత కళో, ఆమె లేకపోతేనే కొట్టొచ్చినట్టు తెలుస్తోంది. ప్రతీ కుటుంబానికీ స్త్రీ ఒక ప్రొటెక్టివ్ ఫోర్స్. ఆమెకే కనక- నా యిల్లు, నా భర్త, నా పిల్లలు అనే స్వార్థం లేకపోతే ఈ కుటుంబ వ్యవస్థ కూలిపోవడం ఖాయం. ఏ కుటుంబాన్నైనా తన సర్వస్వాన్ని సమర్పించి వేయికళ్ళతో కాపాడుకునేది ఆమే! ఆ ఋణం ఏం చేసినా తీరనిది.

వంటావిడా, నౌకరూ వానలో తడుస్తున్న నన్నే చూడటంతో గబగబా యింట్లోకి వచ్చేశాను.

★ ★ ★

అమెరికా వెస్ట్‌కోస్ట్‌లో స్ప్రింగ్ సీజన్ మొదలైంది. మధ్య మధ్యలో చిరుజల్లులూ, చిరుచలీ మిళితమై వెదర్ తమాషాగా ఆహ్లాదంగా వుంది. నేనూ, వింధ్యా ఇలా కాలిఫోర్నియాలోని ఫ్రీమాంట్ వీధుల్లో కలిసి మార్నింగ్ వాక్ చేస్తుంటే ఏదో కొత్తగానూ, హాయిగానూ వుంది.

వింధ్య మౌనంగా నా ప్రక్కనే నడుస్తోంది. బహుశా నాతో కలిసి పంచుకుంటున్న ఈ అందమైన ఉదయాన్ని మౌనంగా ఆస్వాదిస్తుంటుంది. నలభై అయిదేళ్ళ వింధ్యని యవ్వన రేఖలకి వదలాలని లేదు కాబోలు. రెండు మూడు వెండి వెంట్రుకలు తప్ప, అదే నాజూకుతనం, గులాబీ రంగు వెంకటగిరి జరీ చీరలో ఒదిగిపోయి, పాత్‌వేలో వున్న రోజాపూలతో పోటీపడుతోందింది తన అందం. అల్లిన పొడవైన జడని అందంగా సిగచుట్టుకొని నిండుగా అచ్చం తెలుగింటి ఇల్లాలై ఒద్దికగా నడుస్తోంది. ఇద్దరికీ ఈ అనుభవం కొత్తేమరి!

హఠాత్తుగా అమెరికాలో ప్రత్యక్షమైన నన్ను చూసి వింధ్య, సన్నుతా కూడా ఆశ్చర్యానందపడిపోయారు. ఒక్కక్షణం మెరిసిన వింధ్య కళ్ళు ఎందుకో ఒకింత సందేహాన్ని వెలిబుచ్చాయి. నిండుగా బరువుగా నడుస్తూ మా పెద్దమ్మాయి సన్నుత సంతోషంతో నన్ను చేరుకొంది. వెంటనే దగ్గర్లోనే వుంటున్న చెల్లెలు వినతకి ఫోన్ చేసి రప్పించేసింది. ఇద్దరూ నా చుట్టూచేరి సందడి సందడి చేశారు. చాలాసేపు ఇండియా నుండి తీస్కెళ్ళిన గిఫ్ట్‌లన్నీ చూసి మురిసిపోయారు. వింధ్య చిరునవ్వుతో చూస్తూ మధ్య మధ్యలో 'జాగ్రత్త, నెమ్మదిగా' అంటూ హెచ్చరిస్తోంది. అల్లుడు విఖ్యాత్ పనిమీద బోస్టన్ వెళ్ళాడట.వింధ్యనీరోజు వాకింగ్‌కి వెళ్దామన్నప్పుడు నమ్మలేనట్టుగా చూసిందో క్షణం. అంతే మాట్లాడకుండా నాతో బయలుదేరింది. ఏదో పాటని మధురంగా హమ్ చేస్తూ నడుస్తున్నది కాస్తా "రాణీ!" అన్న నా పిలుపు విని టక్కున ఆగిపోయింది.

చిరునవ్వుతో చూస్తూ "నా పేరు వింధ్యారాణీ అని నేనే మర్చిపోయాను సుమా! ఎనీ వే మీరిలా రాణీ అని పెళ్ళైన కొత్తల్లో పిల్చేవారు కదూ! మళ్ళీ రోజు యిలా. నాకెంతో బావుంది" అంది మెరిసే కళ్ళతో.

"అది సరే కాని, హిమాలయాల్ని అతి దగ్గరగా మనమెక్కడ చూద్దాం చెప్పు"

నావైపు విస్మయంగా చూస్తూ "అంటే నా లెటరందిందా మీకు?" అని ఆశ్చర్యపోయింది.


"ఎందుకలా ఆశ్చర్యపోతావు? అందాలనేగదా రాసింది?" ఈసారి ఆశ్చర్యపడ్డం నా వంతైంది.

"అలా కాదండీ! వుత్తరం చేరడానికి రెండు వారాలైనా పడ్తుంది కదా! మీకప్పుడే ఎలా అందిందా అని"

"పోస్ట్‌లో పంపిస్తే అలా. కానీ నువ్వు కొరియర్‌లో కదా పంపింది" అన్నాను.

"కవరు విఖ్యాత్‌కిచ్చాను. కొరియర్‌లో పంపించాడన్న మాట. నా వుత్తరం అందుకోకుండానే, మీ బిజినెస్ పని మీద బయలుదేరి వచ్చారేమో అనుకొని నిరాశపడ్డాను సుమా! అలా రాసినందుకు మీరు ఏం అనుకోలేదు కదా! ఏదో ఎమోషనల్ మూడ్‌లో రాసేశానంతే"

అదన్నమాట సంగతి. నన్ను చూడగానే తన కళ్ళల్లో కదలాడిన సందేహానికి కారణం.




"అలా ఏం లేదు కాని, చాలా మంచి పనిచేశావు. లేకపోతే నాకెప్పటికీ నీ మనసులోని భావాలూ, కోరికలూ తెలిసేవికావు కదా. సరే యిప్పుడు చెబుతున్నాను విను. మన సిల్వర్ వెడ్డింగ్ యానివర్సరీ అదే మన వివాహ రజతోత్సవాన్ని 25 రోజులపాటు, హిమాలయాలు ఎక్కడెక్కడైతే అతి సమీపంగా కనిపిస్తాయో ఆయా వూళ్ళలో మనమిద్దరం మాత్రమే జరుపుకుందాం. తెలిసిందా. నో బిజినెస్ వ్యవహారాలు! తెలిసిందా? నువ్వు అమ్మమ్మవీ, నేను తాతయ్యనీ అవ్వకముందే సుమా అదీనూ" ఉత్సాహంగా చెప్పాను.

"అదెలా కుదురుతుంది? ఇంకో రెండు నెలల్లో సన్నుత డెలివరీ. దానికోసమే కదా వచ్చింది!"

"దాని డెలివరీ టైమ్‌కి నిన్ను భద్రంగా తీసుకొచ్చి యిక్కడ దింపే పూచీ నాది. సరేనా? వచ్చేవారమే యిండియాకి మన ప్రయాణం. వీసాలు, గీసాల సమస్యలు నాకొదిలెయ్. నేను చూసుకుంటా అవన్నీ" నా గొంతులో సరదా గంతులేసింది. వింధ్య ముఖంలో వేయి వెలుగులు. గుండెల్లో వుప్పొంగిన సంతోషం ముఖమంతా చిమ్మింది. తల వంచుకొని నడుస్తున్నదల్లా ముఖమెత్తి "పిల్లలేమనుకుంటారోనండీ! మన సిల్వర్ వెడ్డింగ్ యానివర్సరీని వాళ్ళు నలుగురూ బ్రహ్మాండంగా ప్లాన్ చేస్తున్నారని మీకు రాశాను కదా!" అంది సాలోచనగా.

"అబ్బా! రాణీ యిప్పటికే మంచితనమంతా నీ బ్యాంక్‌లో వేసేసుకున్నావు. నన్నూ మంచి భర్తగా ప్రూవ్ చేసుకోనియ్యిలా ఈసారి? ఎలా చెబితే పిల్లలు కన్విన్స్ అవుతారో నేనలా చెబుతాను కదా! నీకెందుకు చెప్పు?" మొదటిసారిగా తనని సంతోషపెడ్తున్నానన్న ఆలోచన నాలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

"సరే! మీ యిష్టం. నన్నందలం ఎక్కిస్తానంటే నాకంతకన్నా ఏం కావాలి? మన యిండియాలోనే హిమాలయాల్ని చూస్తూ మనం 'స్వర్ణోత్సవం' జరుపుకుందాం" అంటూ నవ్వింది అల్లరిగా.

"అదేంటి? మరో పాతికేళ్ళు ముందుకు పరిగెత్తావు. స్వర్ణోత్సవం యాభయ్యో పెళ్ళిరోజున చేసుకుంటారు తెలుసా" అన్నాను.

"తెలుసండీ బాబు. మనిద్దరం మాత్రమే ఇరవై అయిదురోజులపాటు నా మనసైన చోట్లలో చేసుకొనే రజతోత్సవం నాపాలిట స్వర్ణోత్సవం. అవన్నీ పదిలంగా నామదిలో దాచుకోబోయే బంగారు క్షణాలు" తన మనసప్పుడే విహంగమై ఏదో సుందరలోకాల్లో విహరిస్తున్నట్లుగా వుంది.

"ఊ! భావుకత నిజంగా నీలో ఎక్కువుండడమే కాదు, నెమ్మది నెమ్మదిగా నాకూ ఎక్కిస్తున్నావు సుమా!" నవ్వేశాను.

వింధ్య, కాదు నా రాణీ ముఖంలోని తృప్తి నా గుండెలదాకా చేరి అక్కడ హరివిల్లై విరిసింది.

✪